మార్పుకి మార్గం

ఆరోజు చినుకుగాలి. వాతావరణం అంతా యీదరగా ఉంది చీకటిపడి ఓగంటేనా కాకపోయినా ఎంతోరాత్రయినట్లుంది. వీధులన్నీ బురద బురదగా వున్నాయి. వీధిన నడిచే వాళ్ళ అడుగుల చప్పుడు తాటాకిళ్ళకప్పులమీద పడే చినుకుల చిటపటతో గాలి రొదతోను కలిసిపోయి గందరగోళంగా వుంది.

పొలంపనులు పూర్తిచేసుకుని తిరిగివస్తున్నారు కూలీలు. కూలీలలో చాలామంది మాలపల్లిలోకే మళ్ళుతున్నారు. మాటమంతీ ఆడుకుంటూ ఆడవాళ్ళు నెత్తిన పమిటకొంగు కప్పుకొని, మగవాళ్ళు తాటాకు నెత్తికి అడ్డుపెట్టుకొని ఒక్కొక్కళ్ళే మాలపల్లిలోకి పోతున్నారు. ఒక్కొక్క గుడిశలోనే దీపాలు వెలుగుతున్నాయి. పొయిలు రాజుకుంటున్నాయి. యిళ్ళ కప్పులమీంచి పొగమందకొడిగా లేచి వాన చినుకులతో సరసమాడుతోంది.

సుబ్బడు వంట్లో బాగోక ఆరోజున పనిలోకెళ్ళలేదు. లోపల కిరసనాయిలు దీపం వెలుగుతోంది. ఏమి తోచక లోపలికెళ్ళి దీపాన చుట్ట ముట్టించుకొని వచ్చి నులకమంచం మీద ముడిచిపెట్టుకొని కూర్చున్నాడు. దవడలు నొప్పిపుట్టేలా పీల్చినా ఆ చుట్టలోంచి పొగ రావడంలేదు. చుట్ట పూర్తిగా

ఆరిపోవడమూ లేదు పుత్రమ్మ పొయ్యిదగ్గరే వుంది. అన్నం తెడ్డుతో కలియబెడతోంది.

యింటికి పోతున్న మరియమ్మ సుబ్బడి గుడిశముందు ఆగి 'పుత్రమ్మత్తా! మావకేదో వుత్తరం వచ్చిందట. మాట్ట గారు సెప్పమన్నాడు.' అంది.

'ఏడనుంచే?' అని సుబ్బడు కలిపించికున్నాడు.

'ఏమో. అయ్యన్ని నాకు సెప్పేడేటాయన' అని వెళ్ళి పోయింది మరియమ్మ.

'దీని తల్లి సిగ తరిగించి యీవానలో ఎవడెడతాడే టిప్పుడు. రేపు పొద్దుటేల ఎల్లి తెచ్చుకోవచ్చు లెద్దూ'అన్నాడు సుబ్బడు పుత్రమ్మకు వినబతేలా.

బాగానేవుందిలే వరస. మనవుత్తరం యాడనుంచొత్త దేటి? వత్తే ఆడికాడనుంచేగా, ఆడికాడనుంచి పాతిక పరకా డబ్బొత్తే ఎగేసుకెడతావు గాని వుత్తరం వత్తే ఎల్ల లేవు మరి! నువ్వెళ్ళకపోతే నేనే ఎల్తాను. బిడ్డ కాడినించి వుత్తరం వత్తే వడలేసి రేపుటేల దాకా నేనుండలేను సుమా.' అని బయలు దేర బోయింది పుత్రమ్మ.

'ఓసి నీ సిగతరగ. ఉండెహా, నువ్వు కూడొండు బేగా నేనె ఎల్లి సదివించుకొత్తాను.' అని తాటాకు గొడుకేసుకొని బయలుదేరాడు సుబ్బడు. సుబ్బడు మాష్టారింటికెళ్ళి అరుగు వార నిలబడి రెండు మూడు కేకలు పెట్టాడు.

'ఎవరూ!' అంటూ తలుపు తెర చేడు మాష్టారు.

'నేనండి. సుబ్బడ్ని పెసిడెంటుగోరి పాలేర్నండీ.'

'ఏరా సుబ్బా! నాలుగైదు రోజుల నుంచి నీకు ఉత్తరం వచ్చిందని కబురంపుతూ వుంటె ఎక్కడో అయిపూ జాడ లేవు. అంత తీరిక లేకుండా పోయిందేమిట్రా?'

'అదేటండిబాబూ! నాకీయాలేకదండి కబురందుత.'

'అయితే యింతవరకు నీకు కబురే అందలేదన్న మాట! బాగా నేవుంది. మాలపల్లిలోకి వెళ్ళే ప్రతివాడికి చెప్పాననుకో వాళ్ళకి నామాటంటె లెక్కా జమా.'

"ఉత్తరం ఏడనుంచండీ?"

'ఓరి నీ తొందర మండ ఆగరా నేను మాత్రం చూశానా! అసలా ఉత్తరం ఏమూల తగలబడిందో చూడనీ ముందు' అని ఉత్తరాలకట్ట విప్పి వెతకడం మొదలెట్టాడు.

'ఆపడిందా అండి?'

'వెతుకుతున్నాగా, వుండు ఈ వెధవ ఉదోగానికి వేళాపాళా లేదు. వచ్చే జీతం పాతిక. చేయాల్సింది గొడ్డు చాకిరీ. పోష్టు మాష్టర్ని పోష్టు బంట్రోతుని అన్నీ నేనే యింటింటికి ఉత్తరాలిచ్చి రావడం డబ్బాలోపడ్డ ఉత్తరాలన్నీ తీసి రోజూ ముద్రకొట్టడం వాటిని కట్టపెట్టి సబాపీసుకి పంపడం చిల్లర దుకాణంలా కవర్లు, కార్డులు అమ్మడం– పైగా స్కూలు కెళ్ళి టైముకు సంతకం పెట్టడం రామ రామ మరబతుకై పోయిందనుకో అమ్మయ్య దొరికిందిరా.' అంటూ గొణుక్కొని సణుక్కొని ఉత్తరం తీశాడు బయటకి.

నిజానికి ఆ మాష్టారు ఆ వూళ్లో స్కూలు మాష్టరు పోస్టు మాష్టరు ఆయుర్వేదం డాక్టరుకూడాను. ఊళ్లో పెద్దింటి వాళ్ళకి వచ్చిన ఉత్తరాలైతే ఆ రోజు కారోజే స్వయంగా తీసు కెళ్ళి చప్పజెప్పి వస్తాడు. మాలపల్లికి శెట్టిబలిజ పేటకి వచ్చిన ఉత్తరాల్ని వాళ్ళకి కబురంపి వాళ్ళు వచ్చిననాడే యిస్తాడు. అదీ అతని పద్దతి. అందుకే నాలుగైదు రోజుల క్రితం వచ్చిన ఉత్తరం ఆరోజుదాకా సుబ్బడికి చేరలేదు.

'కాత్త సదివిపెట్టండి!' అన్నాడు సుబ్బడు.'

మాష్టారు ఉత్తరం చదువుతోంటే సుబ్బడు శ్రద్ధగా వింటున్నాడు.

'అమ్మకి నాన్నకి నమస్కారములు మన ప్రాంతానికే నాకు బదిలీ అయింది. వచ్చేవారంలో బహుశా శనివారం నాడు మనవూరు వస్తాను. పిన్ని కులాసాగానే వుంది' అలా ఉత్తరం వింటూంటే సుబ్బడికి ఎంతో ఆనందంగా వుంది

'నీకొడుక్కి ఏమిట్రావుద్యోగం?' ఉత్తరం చదివాక అడిగాడు మాష్టారు.

'అదేదో ఇంజనీరం అటండి నాకూ బాగా తెల్దు.'

ఉత్తరం తిరగమరగతిప్పి చంపావుకదట్రా యింజనీరా యింజనూ మరా అంటూ వేంరా?

'నాకు తెలికండా, వత్తాానండా, ఇంటికాడ ఆడది ఉత్తరం ఏటోనని ఎదురు సూత్తూ వుంటది.'

'అది సరేరా! ప్రెసిడెంటుగారి పొలంలో పాక మీద మొన్న మంచి లేతానపకాయలు చూసాను. రేపు నువ్వు పొలం నుంచి వచ్చేటప్పుడు ఓపింది తుంపుకురారా!' అన్నాడు మాష్టారు రివాజుగా.

అట్టాగే నండా!' అని సుబ్బడు యింటికి బయలు దేరాడు.

సుబ్బడు కోసం పుల్లమ్మ ఎదురు చూస్తోంది. చూరు కిందకి దూరగానే 'ఏటిరాసాడు? అబ్బాయికాడ నుంచేనా ఉత్తరం?'

'ఆడికాడనుంచే నీకూ నాకూ నమసకారాలంట మాష్టరు సదువుతుంటే పెద్దింటోళ్ళ కుర్రోడు రాసినట్టనిపించిందే'

'సరేలే నీ సంబరానికేం! యిసయ వేటో సెప్పు?'

'యిసయానికేముందేటి? మన పక్క పట్నానికే బదిలీ అయినాడంట. శనోరం న్నాడు మనూరొత్తాడంట'

'శనోరవా? శనోరం ఎప్పుడూ అయ్యో రేపే శనోరం మరిప్పు డెలాగంటావు?' అని కాస్త కంగారు పడింది పుల్లమ్మ.

'యేటే ఆ కంగారు అదేవన్నా పరాయోడా? యాడ నుంచో కలకటేరొచ్చినట్టు ఇదై పోతా వేటి—మనతో బాటే ఆడూను.'

'అది సరేలే. మన్తో బాటే అని నాకూ తెల్సు కూకోటాకి ఓ కురిసేయా తొంగోటాకి ఓ పట్టెమంచవా

ఏవున్నాయి మనకాడ. ఆడు మా 'సెల్లి కాడ పువ్వులా పెరిగాడు. ఆడిక్కడో పూటేనా వుండగలడా అంట.'

'ఔను మరి. మీ 'సెల్లి నరసమ్మ కొలువు సేత్తంది కాబట్టి. పెళ్ళి పెడాకులు లేకుండా తెచ్చిందంతా యీడికే పెట్టి పువ్వులా సూసుకుంది ఎక్కడో మనదేశం కాని దేశంలో సదివించి ది; పెంచింది. పెద్దోడ్ని సేసింది. ఏడాదికో పాలేనా సూట్టానికి యీలు లేకుండా పెంచింది. అయినా ఎందుకూరు కున్నాం. యీడైతేనేం బాగోటం కావాలిగాని అని వూరు కున్నాం. అంత మాతరం సేత కన్నోళ్ళని కాదంటాడేటి ఆడు...' అన్నాడు కాని మనసొప్పలేదు.

తను పడుకున్న నులక మంచం గట్టిగా బిగించాడు అంత రాత్రివేళ. కర్రపెట్టెలో వున్న గళ్ళ దుప్పటీ తీసి దాని మీద పరచాడు. గడ్డి తరగడానికి గుడ్డ చుట్టే దుప్పటీ కింద తూపు దిక్కున దాచాడు. ఒక్కసారి పరిచిన పక్కని చూసి తృప్తి పడ్డాడు. పుల్లమ్మ యిదంతా చూసి 'పైకి డాబేగాని ఆడంటె తనకి మనసులో యిదే!' అనుకుంది.

'ఆడికి సర్కారు కొలువా మరోటా! ఆమంచమంటె మట్టుకు వుంటాడె ఓ పూటకంట. ఏమో రెండు గుడ్లు సూడు మా కాపులింటికాడ నేనో రెండు పచ్చళ్ళు అట్టుకొత్తాను' అన్నాడు పుల్లమ్మతో

'అల్లాగేలే' అని పుల్లమ్మ నడుంవాల్చింది చాప మీద.

నిద్దట్లోకూడా పుత్రమ్మకి కొడుకొచ్చినట్టు పిలిచినట్టు అనిపించి కళ్ళు తెలిచి చూసి మళ్ళీ కళ్ళు మూసుకునేది.

సుబ్బడు వెలుగు రాకుండానే లేచి వరి నేపొలం ఎడత న్నను యింకా నిద్దరేటి, తెగిసి పని సూసుకో ఆడొచ్చేత్తాడు మరి' అని దీపం బుడ్డిని చుట్టంటించుకొని దుప్పటి కప్పుకొని కర్ర చేత పట్టుకొని పొలం వెళ్ళిపోయాడు.

సుబ్బడి! సొంత పొలం అనేది ఏమి లేదు. చిన్నప్పుడే ప్రెసిడెంటుగారి కమతంలో దూడల్ని కాయడానికి చేరాడు. ఏడాదికి రెండు బస్తాల ధాన్యం సంక్రాంతి పండగకు ఓలాగుగుడ్డ తువ్వాలు ఓ పూటచద్దికూడా అప్పట్లో వాడికి జీతం. అలాచేరిన సుబ్బడు యిప్పుడు ఆకమతానికి పెద్ద పాలికాపు కమతం పేరు ప్రెసిడెంటుగారిదే అయినా చూసేదంతా సుబ్బడే- కూలీలను పెట్టటం, పని చేయించటం, పంట పచ్చిడి చేయటం సుబ్బడి వంతు. పంట అమ్మటం. సొమ్ము చేసుకోవటం, దాచు కోవటం ప్రెసిడెంటు వంతు.

అంత బాధ్యతను మోస్తున్నా సుబ్బడు ఎప్పుడూ కక్కుర్తి పడలేదు ఏటా యిచ్చే పదిహేను బస్తాల ధాన్యం తోనే బతకటం అలవాటు చేసుకొన్నాడు. వళ్ళు వంచి పని చెయ్యటం కూడ సుబ్బడికి అలవాటే! అందుకే ఆకమతాన్ని అంతకాలం అంటిపెట్టుకొని వుండగలిగాడు. తనూ ఓ కమతం ఏర్పరచుకోవాలని ఓ మెట్టు పైకెక్కాలనీ అనుకోవట, నేరం కాదుగాని అనుకొని వుంటే ఎప్పుడో ఆకమతానికి దూరమై పోయేవాడు.

చీకటి తోటి పొలం వెళ్ళిన సుబ్బడు పొలంలో దూడల్ని చూసుకోని జనానికి పనులు పురమాయించి పాలకావిడి పట్టుకొని పెద్దన్నాల వేళకి ప్రసిడెంటు గారిల్లు చేరుకున్నాడు పాల చెంబుల్ని అరుగు మీద పెట్టాడు.

ప్రెసిడెంటుగారి భార్య సీతమ్మ వచ్చి పాలచెంబులు లోపలికి పట్టుకెళుతూ 'గొడ్ల సావిట్లోకి రా కాళ్లూ గిన్నే కడుక్కోని కూకో అన్న పట్టుకొస్తాను' అంది.

సుబ్బడు గొడ్లసావిట్లోకి వెళ్ళి దూలం మీదున్న అల్యూమినియం గిన్నెను తీసి గోళెంలో నీళ్ళెట్టి కడుక్కోని ఓ స్థంభానికి జారబడి కూర్చున్నాడు. సుబ్బడు ఆ కమతంలో దూడల్ని కాయటానికి చేరినప్పట్నుంచీ ఆ సావిట్లోనే దూడల పక్క తిండి తింటున్నాడు. అప్పట్లో కుండ మూకుట్లో తినేవాడు పుత్రమ్మ కాపురానికి వచ్చింతర్వాత అల్యూమినియం గిన్నెలో తింటున్నాడు.

సీతమ్మ అన్నం పట్టుకొచ్చి గిన్నెలో పెట్టింది. చల్లా గంజీ పోసి చింతకాయతొక్కు నంజుకుందికి వేసింది.

'ఈయేల మావోడొత్తన్నాడండి పట్నంనుంచి' అన్నాడు సుబ్బడు.

'ఏం చేస్తున్నాడు మీవాడు పట్నంలో?'

"ఏదో ఇంజనీరటండి, నాకు బాగా తెల్దు. మొత్తానికి మంచి కొలువేనటండి, పోట్టుమాష్టరుగారు కూడా అన్నారు."

ఇంతలో ప్రెసిడెంటు అటువైపువచ్చి 'ఏరా సుబ్బా నిన్న రాలేదు?' అని అజామాయిషీ చేశాడు.

"నిన్న కాతంత పులపరంగా వుండి రానేక పోయా నండి"

'రోగం వక్క రోజు కేతగ్గిపోయిందా? నిన్న వంట్లో పుల పరంగా వుంటే ఈ వేళపొద్దున్నే చద్దికూడెందుకు మెక్కు తున్నావురా! అన్నీసాగుబడి రోగాలు త్వరగా కానియ్ ఈ వేళేనా చెరుకు చుట్టు ఆరగొట్టించు' అని లోపలి కెళ్ళ బోతూంటే బిలు కలక్టరు వచ్చాడు

'ఏం' అన్నట్లు చూశాడు ప్రెసిడెంటు.

"సమితినుంచి సూపర్వైజరూ, కొత్త ఇంజనీరుగారూ వచ్చారండి. మనరోడ్డుకి పోసిన కంకర గుట్టలు చెక్ మెషర్ మెంట్ చెయ్యడానికి వచ్చారంట తమర్నీ కంట్రాక్టరుగారినీ ఆఫీసుదగ్గరకు పిల్చుకు రమ్మన్నారు."

"కంట్రాక్టరెవడు? ఏదో రివాజుకి ఆ పోతురాజుగాడ్ని పెట్టాను, పెట్టుబడంతా మందే కద. నువ్వెలి వాళ్ళిద్దర్నీ యిక్కడకే తీసుకురా" అని బిల్ కలక్టరును పంపించేసాడు ప్రెసిడెంటు.

"ఒరేసుబ్బా! నువ్వు త్వరగా కానిచ్చి కోడిని కోసి మరీ పో పొలం, ఇంజనీరూ వాళ్ళూ వచ్చారట" అని లోపలి కెళ్ళి పోయాడు.

సుబ్బడు తిండితిని గిన్నె కడుక్కొని నీళ్ళుతాగి గిన్నె దూలం మీద బోర్లించుకొని వీధివైపు వెళ్ళాడు. ఇంతలో జీపు వచ్చి ఆగింది.

ప్రెసిడెంటు బయటకొచ్చి "రండి-రండి" అంటూ జీపు లోంచి దిగిన యింజనీర్ని సూపర్ వైజర్నీ ఆహ్వానించాడు. సుబ్బడు పక్కకు తొలిగాడు.

జీపులోంచి దిగిన ఇంజనీరు పరిచయంవున్న యింటిని పరకాయించినట్లు చూసినాడు సుబ్బడు ఇంజనీర్ని పరకాయించి ఒక్కడుగు ముందుకేసి పిలవబోయాడు. అంతలోనే "ఏరా నేచెప్పిన పనయిందా?" అన్నాడు ప్రెసిడెంటు సుబ్బడితో.

"సిత్తం ఇంకా నేదండి."

ఆ మాట విని ఇంజనీరు అటుతిరిగి "నాన్నా నువ్వా" అంటూ దగ్గరకెళ్ళాడు

'ఏరా సుబ్బా మీఅబ్బాయి ఇంజనీరా చెప్పావే కాదే! ఏదో పట్నంలో మీ మరదలు దగ్గర ఉంటున్నాడు చదువు చెప్పిస్తోంది అనే వాడవప్పుడప్పుడు. అంతేగాని ఇంజనీరయ్యాడని ఎప్పుడూ అనలేదేం.' అన్నాడు ప్రెసిడెంటు

'అదేటండీ ఓ సారి యీడ కొలువు కోసరం తమర్ని సిపారసు చెయ్యమని సెప్పాను కాదటండే ఆ యాల కాగితం మీద కూడా రాసుకొన్నారు.'

'ప్రెసిడెంటుకి ప్రాణం లేచొచ్చింది. అవున్రోయ్ నే మరిచేపోయాను ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది. మంత్రిగారికీ ఛీఫ్ ఇంజనీర్ గారికీ మన ఎమ్మెల్యేతో కలసి వెళ్ళి చెప్పాను గుర్తుకొచ్చింది. అయినా నీ వెప్పుడూ మనసైడు రాలేదను

క్కొంటాను' అని ఇంజనీర్ని, సూపర్వైజర్నీ ఉద్దేశించి 'రండి లోపలికి వెళదాం' అన్నాడు.

'పరవాలేదు లెండి అరుగుమీదే కూర్చుందాం బల్ల ఉందిగా' అన్నాడు ఇంజనీరు వినయంగా.

'అరుగుమీద కూర్చోవటం ఏమిటండి నా కలాంటి పట్టింపులు ఏమీ లేవు స్వతంత్రం వచ్చినప్పటినుంచీ ఖద్దరు కడుతున్న మనిషిని అప్పట్నుంచీ యీ వూరికి నేనే ప్రెసిడెంటుని. ఏ ఆఫీసరొచ్చినా నా పక్కన కూర్చొని భోంచెయ్యాల్సిందే. ఏ కులమైనా కానివ్వండి. అసలు మా నియోజకవర్గం రిజర్వు నియోజకవర్గమా దాంతో మా ఎమ్మెల్యే కూడా హరిజనుడే అయినా మా ఇంటికి వస్తే నా పక్కన కూర్చుని భోంచెయ్యాల్సిందే. ఇంక మరి వూళ్లో మాల మాదిగ లంటారా వాళ్ళను ఆ మాత్రం దూరంలో ఉంచటం ఊరు కట్టుబాటుని పట్టి తప్పదు మరి పదండి. పదండి లోపలికి పదండి. కాస్తి ఫలహారం చేసి రోడ్డుమీదకు వెళదాం తిరిగి వచ్చేసరికి భోజనాలు తయారౌతాయి!' అంటూ ఆర్భాటంగా ఓ అడుగు ముందుకేసి 'సుబ్బా నువ్వెళ్ళిపోక లోపలికి రా అబ్బాయితో మాట్లాడి వెళుదువుగాని' అని లోపనికి దారితీశాడు ప్రెసిడెంటు.

ఇంజనీరు ఒక్కసారి తండ్రిని చూశాడు.

మోకాళ్ళపైకి పంచీ, మాసినగడ్డం, చేతిలోకర్రా. నేగిన తలా గుండెలమీద సగం నెరసిన రోమాలూ: కాయ తీరిన శరీరంమీద రంగుమాసినతువ్వాలూ కళ్ళనిండాఆనందం.

ఇంజనీరు నాలుగుమెట్లెక్కి లోపలి కడుగు పెడతూ వెనక్కి తిరిగి తండ్రికోసం చూశాడు. తన అడుగులంత తేలిగ్గా తన తండ్రిపాదాలు కదల్లేదు. అక్కడే నిలబడినవో టే అంటి పెట్టుకొని ఉన్నాయి.

'రా!, నాన్న, అన్నాడు ఇంజనీరు.

అది విని 'రా! సుబ్బా!, రమ్మంటూంటే అక్కడ నిలబడిపోయావేం' అన్నాడు ప్రెసిడెంటు

అధికారం ఆహ్వానం ఆ పిలుపులో ధ్వనించాయి.

సుబ్బడు వాళ్ళవెనకే నడిచాడు.

'తనకొడుకు ఇంజనీరు కావటం మూలాన ప్రెసిడెంటు మంచివాడు కావటంచేతా తా నెన్నడూ దాటని ఆ సింహ ద్వారం దాటి లోపలి కడుగుపెట్టగలుగుతున్నాను ఇన్నాళ్ళకి' అనుకొన్నాడు సుబ్బడు.

లోపల గదిలో డైనింగ్ టేబిల్ మీద ఫలహారా లమర్చి వున్నాయి. 'రండి చేతులు కడుక్కోండి సుబ్బా, టవలూ అక్కడే ఉన్నాయి' అని చెప్పి వాళ్ళు చేతులు కడుక్కొంటూవుంటే బొమ్మలా నిలబడిన సుబ్బడిని ఉద్దేశించి 'చూడు సుబ్బా అన్నట్టు నే మరచిపోయాను ఈవేళ మన షావుకారు ధాన్యం తూచుకొనిడబ్బిస్తానన్నాడు దగ్గరుండి ధాన్యం తూపించి ఆ డబ్బు తీసుకో. నేను ఇంజనీరుగారివెంట వెళ్ళాలి' అని తనకి ఇబ్బందిలేకుండా పాలేరు సుబ్బడ్ని వదిలించుకున్నాడు ప్రెసిడెంటు.

'మరి నే వత్తానురా అబ్బాయ్' అన్నాడు సుబ్బడు నెమ్మదిగా. గొంతుజీరబోయి మాట స్పష్టంగా లేదు.

చెయ్యి తుడుచుకుంటూ ఇంజనీరు దగ్గర కొచ్చాడు.

'అమ్మ నీకోసం నిన్న రేతిరి నుంచీ ఎదురు చూస్తుందిరా!'

'ఈ పనయిపోగానే నే నింటికే వెళతా నాన్నా. నీ పనిచూసుకొని త్వరగా వచ్చెయ్'

సుబ్బడు వెళ్ళిపోయాడు.

ఇంజనీరు కుర్చీలో కూర్చున్నాడు. మనసంతా చిందర వందరగా ఉంది.

'మీరుకూడా కూర్చోండి' అన్నాడు ప్రెసిడెంటు తనూ కూర్చుంటూ సూపర్ వైజర్ ని ఉద్దేశించి.

ముగ్గురూ కూర్చున్నారు ఫలహారాలు తింటున్నారు.

ఇంజనీరు ఎటో పరధ్యానంగా చూస్తూతింటున్నాడు.

'మీ నాన్న అన్న మాటలు మీరు వినేఉంటారు మీఉద్యోగంగురించి మొదట్లో సుబ్బడు నాతో చెప్పాడు. వెంటనే నేను చీఫ్ ఇంజనీరుకీ, మంత్రిగారికీ కూడ గట్టిగా చెప్పాను. నామాట వాళ్ళు కాదనర్లేండి, ఎంచేతంటే మా నాన్నగారు గాంధీగారు కాకినాడ వచ్చినపుడు ఉప్పు సత్యాగ్రహంలో అరెస్టయ్యారు. అప్పట్లో పోలీసులు ఈయనపేరు తెలియక లిస్టులో రాయలేదు అనుకోండి లేకపోతే అదో

పదెకరాలు మనక్కలిసేదే - అదంతా పైవాళ్ళకు తెలియ టంతో మన మాటేదీ కొట్టేయ్యారు.'

'మన సమితి ప్రెసిడెంటు గా కూడా మన ప్రెసి డెంటుగారు ఎంతంటే అంతేనండి అని పాడాడు సూపర్ వైజరు.

కాసేపు మౌనంగా ఉండి మీరు మన ఇంజనీరుగారికి చెప్పలేదా' అన్నాడు ప్రెసిడెంటు.

''మీరు చెబితేనే బాగుంటుందని నే చెప్పలేదండి.''

''ఏమిటీ!'' ఇంజనీరు కలగజేసు కొన్నాడు.

''మరేం లేదండి. చెక్ మెషర్ మెంటుకి రావటం అవసరంలేదూ అని. ఎందుకంటే వర్షాకాలం వచ్చే స్తోందనీ, త ఇంజనీరు ట్రాన్స్ఫర్ కావటం కొత్తగా మీరు రావటం ఇదంతా ఆలస్యం అయిపోతుందని సూపర్ వైజరుగారు కంకరగుట్టలు కొలవటంతోటే నే దగ్గరుండి కంట్రాక్టరుతో చెప్పి కంకర పరిపించేశాను. ఓమాట మన సమితి ప్రెసిడెంటు గారితో కూడా అన్నా ననుకోండి మీరు వచ్చారని తెలిస్తే సూపర్ వైజరు గారికి తెగ 'యం బకన్స'' పట్టించుకొని నేనే వచ్చేవాడిని'' అన్నాడు ప్రెసిడెంటు.

చెక్ మెషర్ మెంట్ కాకుండా కంకర పరిపించడం లాభమే. ఇంజనీర్ బిల్లు ఆపెయ్యొచ్చు కాని యింజనీరు ఏమీ మాట్లాడకపోయినా మనసు లోలోపల సణుక్కుంది. అందుకే తన ఉద్యోగం ఈయనే యిచ్చినట్లు మాటాడు

తున్నాడు. ఈనాడు ఇంజనీరుకి డిమాండు లేకపోవచ్చుగాని తను ఇంజనీరింగు పూర్తిచేసిన నాటికి పాసు కావటమే తడవుగా ఉద్యోగం వొచ్చాయి అందులోనూ షెడ్యూల్డు కాష్టువాడు తనకంటేతక్కువ మార్కులు వచ్చిన షెడ్యూల్డు కాష్టు స్టూడెంట్సందరికీ వచ్చాయి ఉద్యోగాలు. అయినా యీాయన మొహార్బానీ నిలుపుకోని తనపని నాచేత చేయించుకోందుకు నాకు యీ ఉద్యోగం తనే యిప్పించినట్లుమాట్లాడుతున్నాడు. ఉపకారంచేస్తే నాపాలేరు సుబ్బడికొడుకు నామాట కాదంటాడా అనుకొంటాడు. ముక్కుసూటిగా పోతే అడ్డమైన అంగాజాతి వెధవలనీ అందలం ఎక్కిస్తే కళ్లు నెత్తికెక్కుతాయి అంటాడు" – అలా మనసు అల్లుకొంటూ పోతోంది యింజనీరుడి.

'రోడ్డు ఓ సారి చూద్దురుగాని మీరుకూడా రండి వెళ్దాం" అన్నాడు ప్రెసిడెంటు

"ఆ రోడ్డుమీంచే మా జీప్ వచ్చింది చూసే దేముది లేండిక."

"పోనీ ఊరి చివర హరిజనులకు ఇళ్ళస్థలం ఆక్వైర్ చేయించాను ఓసారి చూద్దాం రండి" అన్నాడు ప్రెసిడెంటు తన హరిజనోద్ధరణని గుర్తుచేస్తూ.

"ఊరి చివరేగా హరిజన కాలనీ లుండేవి చూసే దేముంది లెండి. ఊరి మధ్యనుంటే చూడాలిగాని" అని ప్రెసిడెంటు మాటలకు అడ్డు తగిలాడు యింజనీరు.

"ఢొంక తిరుగుడు లాభం లేదనుకొని సూటిగానే దిగాడు ప్రెసిడెంటు.

"మరి చెక్ మెషర్మెంటు సంగతి ఏం చేస్తారు. యం బుక్' మీద మీరు సంతకాలు చేస్తేనేగాని బిల్లు చేయడానికి వీల్లేదని సూపరువైజరు ఆపుకొని కూర్చున్నాడు."

"ఆఫీసు కెళ్లాక చూస్తాలెండి. నేనో సారి మాయింటి కెళ్లొస్తాను" అంటూ లేచాడు యింజనీరు.

"మీరక్కడ కెందుకు సార్ పుత్రమ్మకు నేకబురంపు తాను యిక్కడికే వస్తుంది. అక్కడ కూర్చుందుకూ నించుం దుకూ ఉండదు."

"పరవాలేదు లెండి అక్కడ పుట్టిన వాడినే గా పెరగటం ఎలా పెరిగినా, ఎక్కడ పెరిగినా అంటూ బయు ల్దేరాడు యింజనీరు.

"అవునవును ఆ మాట నిజమే నేనూ వస్తానుండండి. ఈమధ్య మాలపల్లికి వెళ్ళడమే లేదు." అంటూ వెంట పడ్డాడు ప్రెసిడెంటు.

ప్రెసిడెంటూ యింజనీరూ సూపరువైజరూ జీపులో మాలపల్లి దగ్గరకెళ్లి జీపువెళ్లినంతవరకూ జీపులోవెళ్లి జీపు దిగి మాలపల్లిలో నడుస్తున్నారు. జనం అంతా పనుల్లోకి పోవటం చేత నిర్మానుష్యంగా ఉంది.

కొత్తజనాన్ని చూసి కుక్కలు మొరిగాయి. కోళ్ళు, మేకలూ బెదిరాయి.

నులకమంచానా వేళ్లాడుతున్న ముసలిది 'ఎవరోరు' అని కళ్లు విప్పి పరకాయిస్తూ పలకరించింది.

"నేనే సత్తి ప్రెసిడెంటుగార్ని"

"నువ్వా బాబూ! అప్పుడే యెలకస్న నొచ్చేసిందా? నువ్వొత్తే ఎలకస్ననొచ్చినట్టే లెక్క నాకు."

"యింకా లేదే మూడేళ్లేగా అయింది. యింకో రెండేళ్ళకిగాని రాదు యెలక్షను. నా చిన్నప్పుడు మా వీధి పెరడూ తుడిచేది" అన్నాడు ప్రెసిడెంటు వాళ్ళతో.

ఆ ముసలిదాని మాటలు విన్నాక యింజనీరు ఒక్క క్షణం ఆలోచనలో పడ్డాడు.

"ఓటు మూలంగా కనీసం యెలక్షన్ల ముందు యీ గుడిసెల్లో జనాన్ని పెద్దవాళ్లు పలకరిస్తారు. వాళ్ళ పెద్దరికాలు నిలబెట్టుకొందుకు మళ్ళీ అయిదేళ్ళదాకా యెక్కడివాళ్ళక్కడే. స్వాతంత్ర్యం తెచ్చిన పెద్దమార్పు యిదేనేమో-కాని యీ వేళ తన ప్రెసిడెంటుగారింట్లోకి అడుగుపెట్టడం ఆయన ప్రక్కన కూర్చుని ఫలహారం చెయ్యటం తనతండ్రి చిన్నప్పట్నుంచీ ఆయనదగ్గరే పనిచేస్తూ న్నా యీ వేళ లోపల గది లోకి అడుగుపెట్టటానికి, అడుగు ముందుకు వెయ్యలేక పోవటం యెక్కడ తనపక్కనే కూర్చుంటాడోనని పని పురమాయించి తన తండ్రిని ఆయన వదిలించుకోవటం అన్నీ ఇంజనీరు మనసులో గజిబిజిగా సాలెగూళ్ళల్లుకొన్నాయి. ఆసాలిగూళ్ళ మధ్యనుంచి స్పష్టమైన నిజం మనసు చాటుతోంది. అనుభవం

నొక్కి వక్కాణిస్తోంది. ''ఈ అంతరాల్నీ అంటరాని తనాన్నీ చట్టాలూ సంస్కరణలూ ఆలయ ప్రవేశాలూ హరిజన కాలనీలో నిర్మూలించలేవు. దీటికి సరైన పరిష్కారం ఆర్థిక సమానత్వం సాధించటంలో ఉంది. ఆర్థిక స్తోమత పెరిగితే అంతస్థూ పెరుగతునే అంతరాయాలూ తగ్గుతాయి. మనిషికి ధైర్యమూ వస్తుంది. అంటరాని తనమూ జంకుతుంది. నన్ను యీ నాడు ఆయన ప్రక్కన కూర్చోబెట్టినది ఆయన సిద్ధాంతాలు కాదు. మానాన్న ఆయనకు చేసిన సేవలూ కాదు. నాఆర్థికసోమతే నా హోదాయే.

యింతలో తను పుట్టిన గుడిసె దగ్గర పడింది. కన్నతల్లి బయటకొచ్చింది.

''వచ్చావా బాబూ'' అని పలకరించింది. ఆలోచనలు చెదరిపోయాయి. 'అమ్మా' అంటూ ముందుకు నడిచాడు యింజనీరు.